చిన్నదామెర చెరువులో 8.20 ఎకరాల ఆక్రమణ

- పరిశీలించిన హైకోర్టు కమిటీ
- ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలు ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చినట్టు గుర్తింపు

దుండిగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని చిన్న దామెర చెరువును హైకోర్టు నియమించిన కమిటీ బృందం శనివారం సందర్శించింది. రాష్ట్రంలోని వివిధ చెరువుల సంరక్షణ అభివృద్ధి వాటి పురోగతి ఆక్రమణలను పరిశీలించేందుకు హైకోర్టు ఈ కమిటీని నియమించింది. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ప్రభుత్వ ప్లీడర్ టి.శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని భాగాన్ని ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాల, ఎమ్ఎల్ఆర్ఐటీఎం, ఎమ్ఎల్ఆర్ఐటీ ఫార్మసీ కళాశాలలు ఆక్రమించినట్లు హైకోర్టులో పిల్ వేసిన నేపథ్యంలో కమిటీ సభ్యులు సందర్శించారు. సర్వేనంబర్‌లు 484, 483, 486, 488, 489, 492లలో మొత్తం 8ఎకరాల 20 గుంటలు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్ పరిధిలోకి చొచ్చుకు వచ్చినట్లు గుర్తించారు. ఈ స్థలాన్ని ఆటస్థలాలకు, వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నట్లు తేల్చారు. సందర్శించిన వారిలో కమిటీ సభ్యులతోపాటు ఆర్డీఓ శ్యాంప్రకాష్, గండిమైసమ్మ, దుండిగల్ మండల తహసీల్దార్ సయ్యద్ మతిన్, ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ సారా, ఏడీ బుచ్చిరెడ్డి, డీఐ గంగాధర్, దుండిగల్ కమిషనర్ కె.సత్యన్నారాయణ రావు, ఆర్ఐ భారతి ఉన్నారు.



చినదామెర చెరువు బఫర్ జోన్‌లో వేసిన రోడ్డును పరిశీలిస్తున్న హైకోర్టు కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

ఉద్యమకారులను గుర్తించాలి : వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేసుల నమోదుతో సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ప్రయోజనాలు కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. దివ్యాంగులు, మహిళలు ఉద్యమంలో పాల్గొన్నా.. కేసులు నమోదు కాలేదని, కొందరు మారు పేర్లు చెప్పడంతో అసలు పేర్లపై కేసులు నమోదైన వివరాలు లేవన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అసలైన ఉద్యమకారులకు తగిన గుర్తింపునివ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు కమిటీ వేసి పార్టీలకతీతంగా పోరాడాలన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులకు పదవులు కట్టబెట్టిన మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ ద్రోహి అయ్యారన్నారు. కేసీఆర్ జన్మలో మళ్లీ అధికారంలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని పిడమర్తి రవి అన్నారు. 250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్ ప్రకటనపై సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. ఇది ఉద్యమకారులకు దక్కిన తొలి గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకునే అవసరం మాదిగ జాతికి లేదు

- టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎవరి కాళ్ల పట్టుకునే అవసరం మాదిగజాతికి లేదని, మాదిగల హక్కుల కోసం ఎంతకైనా పోరాటం చేస్తామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణమాదిగ జాతిని ఆత్మగౌరవం నుంచి బానిసత్వం వైపు నడపాలని అనుకుంటున్నారని ఆరోపించారు. మందకృష్ణమాదిగను నడిపిస్తున్న మనువాద బీజేపీకి తెలంగాణలో ఆస్కారమే లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ జాతి బీజేపీకి ఓటు ద్వారా బుద్ధిచెబుతుందని ఆయన హెచ్చరించారు.

జేఎన్‌టీయూలో అఫిలియేషన్ దందా..!

- ఇంజనీరింగ్ కళాశాలల గుర్తింపు దరఖాస్తుకు నేటితో ఆఖరు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అధికారులు ఈ ఏడాది త్వరగా అఫిలియేషన్ తీసుకోవాలంటూ తమను ఎందుకు తొందర పెడుతున్నారో అర్థం కావడం లేదని ప్రైవేటు కళాశాలల యాజమాన్య ప్రతినిధులు వాపోతున్నారు. ఎన్‌వోసీలకు ఇచ్చిన గడువును 10 రోజుల ముందుకు ప్రీపోన్‌మెంట్ చేయడం, ఆదివారంలోగా అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకోకుంటే భారీగా జరిమానా విధిస్తామనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పైఅధికారులను సంతృప్తిపరచడం కోసమని అఫిలియేషన్ దందాలకు తెరతీయడం సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యమైతే 100 శాతం ఫీజును జరిమానా అదనంగా చెల్లించాలంటూ.. ఈ నెల 12న యూనివర్సిటీ రిజిస్ట్రార్ పేరిట విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. జరిమానాల పేరిట ప్రైవేట్ కళాశాలలపై జేఎన్‌టీయూ భారం మోపితే.. ఆ భారం అటూ ఇటూ తిరిగి ఆయా కాలేజీల్లో చేరే విద్యార్థులపైనే పడుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా, అఫిలియేషన్ ప్రక్రియ ఆలస్యం కాకూడదనే ఈ ఏడాది త్వరగా ప్రారంభించామని వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు.

27 నుంచే ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు..

ఈ నెల 27 నుంచే ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో నిజనిర్ధారణ చేస్తామని, మార్చి 20లోగా ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రస్తావించారు. వాస్తవానికి గతేడాది ప్రైవేట్ కళాశాలల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను ఏప్రిల్ 20 నుంచి నిర్వహించారు. ఈ ఏడాది రెండు నెలలు ముందుగా చేపట్టడానికి కారణాలేమై ఉంటాయా అని పలువురు చర్చించుకుంటున్నారు.

కైతలాపూర్ గ్రౌండ్‌లో డ్రోన్ విన్యాసాలు



డ్రోన్ షోలో సీఎంఆర్ సంస్థ సభ్యులు, మోడళ్లు



డ్రోన్ షోలోని దృశ్యం

అల్లాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్‌లో మెగా డ్రోన్ షోను శనివారం నిర్వహించారు. ఈ షోలో సీఎంఆర్ సంస్థకు సంబంధించిన విశేషాలను, తాము అందిస్తున్న విభిన్న రకాల ఉత్పత్తులు, ప్రత్యేకతలను వివరించారు. నగధగలు.. మోడల్స్ హొయలు మరోవైపు సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యువెలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ వాక్ కూడా కళ్ల జిగేల్ మనిపించింది. బిగ్‌బాస్ ఫేం జెస్సీ సారథ్యంలో జరిగిన ఈ ర్యాంప్ వాక్‌లో అందమైన మోడల్స్ ఆభరణాలను మేనిపై మెరిపిస్తూ జ్యూయలరీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్య భరిత అనుభూతి అందించాలని డ్రోన్ షో నిర్వహించామన్నారు.

అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్

- సైబర్ నేరగాడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో బాలికలను ట్రాప్‌చేసి అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన నిందితుడు ఆర్టిస్ట్ విజయ్ కుమార్ - 11005 పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించాడు. పార్ట్‌టైం జాబ్స్ ఫర్ గర్ల్స్ పేరుతో స్టేటస్‌లు పెట్టేవాడు. అతన్ని సంప్రదించినవారికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, ఫ్రెండ్స్‌గా మార్చుకొని రోజూ చాటింగ్ చేసేవాడు. తన మాయమాటలతో న్యూడ్ ఫొటోలు, న్యూడ్ వీడియోలు తీసుకునేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం రంగంలోకి దిగి టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి సైబర్ నేరగాడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

వండర్స్ ఆఫ్ ద వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీ

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ప్రియుల కోసం నికాన్ ఇండియా సంస్థ తొలిసారిగా వండర్స్ ఆఫ్ వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీని వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్- ఇండియాతో కలిసి నిర్వహిస్తోంది. మార్చి 3 వరకు జరుగుతుంది. విజేతలకు నికాన్ జెడ్ సిరీస్ కెమెరాలు బహుమతిగా అందజేస్తారు. టాప్ 10లో నిలిచిన వారికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా నేచర్ స్టోర్ మర్చండైజ్‌ను అందించనున్నారు. ఆసక్తి గల వారు నికాన్ ఇండియా వెబ్‌సైట్ (https://capturewithnikon.in/wondersofthewild)లో, ఇన్‌స్టాగ్రామ్ @NikonIndiaOfficialలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.

నేడు సనత్‌నగర్‌లో అగ్నిమాపకశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో క్రెడాయ్ సహకారంతో రూ. 17 కోట్లతో నిర్మితమైన అగ్నిమాపక శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 29,653 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్, గ్రౌండ్, మొదటి అంతస్తులో అగ్నిమాపక కేంద్రాలు, రెండో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి కార్యాలయం, డీజీ, అడిషనల్ డైరెక్టర్స్ కార్యాలయం, నాలుగో అంతస్తులో డైరెక్టర్ జనరల్, బోర్డు రూమ్ ఏర్పాటు చేశారు.

త్రోబాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ త్రోబాల్ సంఘం నూతన అధ్యక్షుడిగా వి.నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం యూసుఫ్‌గూడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. శాట్స్ నుంచి అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, జాతీయ త్రోబాల్ సంఘం నుంచి మధు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు.

ఆచరణాత్మక భాషా విధానం కావాలి

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు



కార్యక్రమంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్లు

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగు చదువుకునే వారికి ఉపాధి అవకాశాలు రావాలంటే ఆచరణాత్మక భాషా విధానం కావాలని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు మహా కాంగ్రెస్ సభలో దార్ల వెకటేశ్వరరావు పాల్గొని వర్తమాన తెలుగుభాషా సాహిత్యాల గమనం, గమ్యం అనే అంశంపై మాట్లాడారు. మాతృభాషలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు, ఆచరణలో సంస్కృతం ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీలలో కూడా తప్పనిసరి అవుతుందని తెలిపారు. తెలుగు సిలబస్ రూపకల్పనలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించుకోవాలని, అలా చేయడానికి విశ్వవిద్యాలయాల కేంద్రంగా స్వయం ప్రతిపత్తిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని దార్ల సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

టీహబ్‌లో షార్ట్ ఫిల్మ్ అవార్డులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేణుస్వామి

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీహబ్‌లో శనివారం తెలుగు షార్ట్‌ఫిల్మ్ అవార్డులు-2023 కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ఏ, కళారాజ్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ పర్యవేక్షణలో డిజిటల్ అవార్డులు-2023 21కెటగిరిలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ జ్యోతిష్యులు వేణుస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మీడియా మాధ్యమాలతో పాటు సోషల్ మీడియాకు ఎంతో క్రేజ్ పెరిగిందన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, టాలెంట్, వంటి రంగాల్లో స్టోరీ మేకింగ్ అంశాల్లో యూట్యూబ్, ఇన్‌స్టా ప్లాట్‌ఫామ్‌లో నేటి యువత స్టార్స్‌గా ఎదగడంతో పాటు స్వయం ఉపాధి పొందుతున్నారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కళారాజ్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత శ్రీనివాస మర్రి, టీఎస్ఎఫ్ఏ ప్రతినిధులు, షార్ట్‌ఫిల్మ్ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

'స్వేచ్ఛ గొంతక'లో అలరించిన రామ్ మిరియాల



పాటలు పాడుతున్న రామ్ మిరియాల

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ గొంతుక అనే ప్రాజెక్టును నిర్వాహకులు శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, స్వరకర్త రామ్ మిరియాల తన పాటలతో సందర్శకులను అలరించారు. తెలుగు భాషలోని నిక యాసలను సంగ్రహించాలన్న ఉద్దేశంతో స్వేచ్ఛ తెలంగాణ అనే స్వచ్ఛంద సంస్థ స్వేచ్ఛ గొంతుక అనే ప్రాజెక్టును రూపొందించి శనివారం ప్రారంభించింది. స్వేచ్ఛ తెలంగాణ సంస్థ మొదటి సారిగా తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్, ఏఐ చందమామ కథలను రూపొందించింది. ఈ సంస్థ రెండో ప్రయత్నంగా తెలుగు వాయిస్ అసిస్టెంట్‌ను అభివృద్ధి చేయడానికి ప్రజాభాగస్వామ్యా న్ని ప్రోత్సహించడానికి శనివారం ఏఐ తెలుగు కచేరి నిర్వహించారు.

స్వేచ్ఛ గొంతుక ప్రాజెక్టు అనేది తెలుగు భాషలో కంప్యూటర్లు, ఫోన్లు, మనుషుల్లా మాట్లాడేలా శిక్షణ ఇచ్చే కార్యక్రమమని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి 2024 చివరి నాటికి పది వేల గంటల వాయిస్ డేటాను సేకరించే లక్ష్యంతో రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎవరైనా తమ వాయిస్‌ని ఇవ్వవచ్చని తెలిపారు. తెలుగులో తదుపరి తరం ఏఐకి శక్తినిచ్చే డేటా సెట్‌ను రూపొందించడంలో సహాయ పడినట్టు అవుతుందన్నారు. ఈ ఏఐ తెలుగు కచేరికి ఫ్యామిలీ అంతా యాభై తెలుగు వాక్యాలను రికార్డు చేయడం ద్వారా కచేరీకి టికెట్ లభించిందన్నారు. ఇవన్నీ మార్చి 2024 చివరి నాటికి జరిగే స్వేచ్ఛా ఏఐ డేస్ కాన్ఫరెన్స్‌లో ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. ఉచిత సాఫ్‌వేర్ డెవలప్‌మెంట్ మోడల్‌తో స్థానికులకు గ్లోబల్ సాఫ్ట్‌వేర్ పరిష్కారాల ను అందించడం స్వేచ్ఛ తెలంగాణ లక్ష్యమన్నారు. ఇది మీడియా టెక్నాలజీ కమ్యూనిటీలో గణనీయమైన పురోగతిని సాధిస్తుందన్నారు. తెలంగాణ అంతటా పలు కళాశాలల నుంచి ఏఐ చందమామ కథలు డేటాథాన్‌లో ఎనిమిది వేల మందిని నిమగ్నం చేసిందన్నారు.

డీఎస్‌యూ, హెచ్‌సీయూ నాయకుల నిర్బంధం



నిరసన తెలియజేస్తున్న డీఎస్‌యూ నాయకులు

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలోని చర్చిని కూల్చిన దళితులపై జరిగిన దాడికి నిరసనగా బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న డీఎస్‌యూ, హెచ్‌సీయూ నాయకులను శనివారం గచ్చిబౌలి పోలీసులు నిర్బంధించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రోడ్డు విస్తరణ పేరుతో చర్చిని కూల్చారని అడ్డుకున్న దళితులపై సుమారు 200మంది దాడి చేశారని, చర్చిని ధ్వంసం చేశారని డీఎస్‌యూ సీనియర్ నాయకుడు కుమార్ రాజా ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ డీఎస్‌యూ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపేందుకు చలో జన్వాడాకు పిలుపునిచ్చారు. దళితుల మీద దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీఎస్‌యూ నాయకుడు కుమార్ రాజా డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేసి చర్చి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కన్వీనర్ వేణు మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి సీఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌యూ అధ్యక్షుడు వెంకటాద్రి, కార్యదర్శులు కమలాకర్, ఉమేష్, మేఘనతో పాటు వర్ధన్ తేజ కవిత, రాణి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు

శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు వారి వారి డివిజన్లలో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ రాజరాజేశ్వరి వృద్ధ ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. గచ్చిబౌలి ఖాజాగూడలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ పంచిపెట్టారు. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన స్ఫూర్తి ప్రదాత కేసీఆర్ అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొనియాడారు.

- శేరిలింగంపల్లి/ కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్ జోన్ బృందం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి)



వివేకానందనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గాంధీ నివాసంలో కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, వెంకటేష్‌గౌడ్, శ్రీకాంత్



జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్లు, నాయకులు

శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా వెంకారెడ్డి



గచ్చిబౌలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా వెంకారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావుపై గత అసెంబ్లీ ఎన్నికల ముందు అవినీతి ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అప్పటి నుంచి మూడునెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. వారం రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న వెంకారెడ్డిని బదిలీపై శేరిలింగంపల్లికి పంపించారు. ఆయన బాధ్యతలు స్వీకరించి ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

జేఎన్‌టీయూ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పద్మావతి

హైదరాబాద్ సిటీ: జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వైస్ ప్రిన్సిపాల్‌గా సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వి.పద్మావతి నియమితులయ్యారు. పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్‌గా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమారాణిని నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ నర్సింహారెడ్డి పనిచేస్తుండగా, అదే విభాగం నుంచి వైస్ ప్రిన్సిపాల్‌ను ఎంపిక చేయడంతో.. ఇంజనీరింగ్ కాలేజీలోని ఇతర విభాగాల ఆచార్యుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.



- హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో యూజెనిక్స్ హెయిర్ సైన్స్ కొత్త శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న క్రికెటర్ మహ్మద్ షమీ, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, పింకిరెడ్డి, హాలీవుడ్ నటీ అలెగ్జాండ్రియా టైలర్ - హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ స్థలంలో బీటీ రోడ్డు తొలగింపు



బీటీ రోడ్డును తొలగించిన అధికారులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారులకే అంతుపట్టని రోడ్డు తొలగిస్తారా? అలానే ఉంచుతారా? అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఫిబ్రవరి 13న ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, ప్రభుత్వ భూమిలో వెలసిన రోడ్డును పోలీసులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ సర్వేనెంబరు 25/1లోని దాదాపు 2వేల పైచిలుకు నాలా బఫర్‌జోన్‌లో బీటీ రోడ్డును వేయడంతో, ఈ రోడ్డును ఎవరు వేశారని రెవెన్యూ ఇరిగేషన్, మున్సిపల్ అధికారులే అవాక్కు అయ్యారు. ఈ కబ్జాపై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డును తొలగించినందుకు స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి రిమాండ్

జీడిమెట్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన సైదులు కుమారుడు పడమటింటి భరత్‌కుమార్(21)ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. శనివారం భరత్‌కుమార్‌ను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాట్ అమ్ముతానంటూ మోసం.. వ్యక్తికి రెండేళ్ల జైలు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్లాట్ అమ్ముతానంటూ డబ్బు తీసుకొని మోసం చేసిన కేసులో నిందితుడికి 11వ మెట్రోపాలిన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆవుల రవి తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేటలోని రాజీవ్ గృహకల్పలో నివాసముండే కృష్ణవేణి స్థానికంగా ఉండే కుంచాల రాము(39) అనే వ్యక్తి పరిచయస్తుడు. ఇతను 2017లో కృష్ణవేణికి స్థానిక బస్తీలో ప్లాట్ ఇప్పిస్తానని చెప్పి రూ.3.5లక్షలు నగదు తీసుకున్నాడు. కొద్దిరోజులకే కృష్ణవేణికి ఇస్తానని చెప్పిన ప్లాట్‌ను ఇతరులకు విక్రయించాడు. దీంతో తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇచ్చేయాలని అడిగిన కృష్ణవేణిపై రాము దుర్భాషలాడాడు. ప్లాట్ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేయడంతోపాటు తన పట్ల దుర్భాషలాడిన రాముపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కోర్టు నిందితుడు రాముకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించింది.

బాలుడిని కొట్టిన మాజీ సైనికుడు

జీడిమెట్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఓ బాలుడిని మాజీ సైనికుడు కర్రలతో విచక్షణా రహితంగా కొట్టాడు. చంద్రగిరినగర్‌లో ఓ మాజీ సైనికుని కుటుంబం, పక్కనే మరో కుటుంబం నివసిస్తున్నారు. ఏడో తరగతి చదువుతున్న మాజీ సైనికుని కుమార్తె(12) శనివారం ఇంటి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లింది. అదే సమయంలో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలుడు బాలికను తగలడంతో బాలిక తండ్రికి చెప్పింది. రెచ్చి పోయిన మాజీ సైనికుడు బాలుడి ఒంటిపై కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో వాతలు పడ్డాయి. బాలుడి తల్లిదండ్రులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన కూతురుపట్ల బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతోనే రెండు దెబ్బలు కొట్టి మందలించానని మాజీ సైనికుడు పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు.



- కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికైన రేణుకా చౌదరిని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, నాయకులు చున్ను పాషా, గోపాల్‌రెడ్డి, యాదగిరి, నయూమ్, రమేష్, అస్లాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు. - కూకట్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి)

కూకట్‌పల్లి ఎంవీఐగా శ్రీనుబాబు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్)గా శ్రీనుబాబు నియమితులయ్యారు. 2016 నుంచి ఇక్కడ పనిచేస్తున్న ముత్యాల సుశీల్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఎంవీఐగా బదిలీ అయ్యారు. నూతన ఎంవీఐ ఖైరతాబాద్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అదే రోజు సుశీల్‌రెడ్డికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించేందుకు ఉద్యోగులు ఏర్పాట్లు చేస్తున్నారు.

25న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న 13వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను మియాపూర్ జనప్రియా అపార్ట్‌మెంట్స్‌లోని షిర్డిసాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి తెలిపారు. వేదికలో పాల్గొనదలిచిన వారు అదే రోజు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వివరాల కోసం 9948321233, 7981813159 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి'

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో ఎనర్జీ ఎఫిషియెన్సీ అండ్ ఎనర్జీ ట్రాన్సిషన్ ఫర్ క్లైమేట్ అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్, సీసీ కోఆర్డినేటర్, ట్రైనింగ్ ఆఫీసర్ రాజేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వాణిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని, రాష్ట్రంలో శక్తి పరివర్తన, వాతావరణ స్థితిస్థాపకతను ఎనేబుల్ చేయడంలో వ్యక్తులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

'తడి, పొడి చెత్తను వేరు చేయాలి'

దుండిగల్: ఇంట్లో వెలువడిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయడంవల్ల దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడతామని, స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని కౌన్సిలర్ శంకర్ నాయక్ సూచించారు. దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు తాండా-2లో స్థానికులతో కలిసి తడి,పొడి చెత్తను వేరు చేసే బ్యాగ్‌లను ఇంటింటికీ అందజేశారు.

PUBLIC NOTICE

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE
MEDCHAL-MALKAJGIRI DISTRICT At: Medchal
O.S.No 37 of 2022

BETWEEN:
P. Rami Reddy ...Plaintiff
AND
Mekala Mohan and others ...Defendants

To
1. Mekala Mohan, S/o. M. Swamy, R/o H.No.7-4-104, Madhavi Nagar, Balanagar, Hyderabad.
2. Vasireddy Siva Leela Prasad, S/o. V. Kailashnath, R/o Flat No.102, Shah Residency, Dattatreya Colony, Asif Nagar, Hyderabad.
3. DiddiSudheer, S/o. D. Laxmaiah, R/o H.No.12-1-760, Asif Nagar, Hyderabad.
4. KuellaPavan Kumar, S/o. Sri K. Hanumanthu, R/o H.No.6-2-424, ChintalaBasti, Khairatabad, Hyderabad
5. M. Ravindranath, S/o. Sri. M. Venkat Reddy, R/o H.No.8-2-322, Plot No.70, Road No.14, Banjara Hills, Hyderabad, T.S
6. Smt. MekalaVaralaxmi, D/o. M. Swamy, R/o Plot No.601, Sharath Enclave, Vinayak Nagar, Balanagar, Medchal-Malkajgiri District.

Please take notice that the plaintiff filed the above suit for declaration and recovery of possession against all of you. You are required to appear before this Hon'ble court on Date 19-02-2024 at 10-30 AM either in person or through advocate along with documents if any in support of your claim, failing which the matter will be decided by the Hon'ble court as per law.

BY COURT ORDER

S.KAMALAKAR Advocate
Suchitra, Hyderabad
Cell No.98483 62904